

టన్ను చీనీ రూ.38 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.38 వేలు పలికాయి.



అంజూర సాగుతో లాభాలు

పెద్దపప్పూరు మండలానికి చెందిన రైతు రమేష్‌నాయుడు అంజూర పంట సాగుతో లాభాలు గడిస్తున్నారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
40.9°/23.3°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. మధ్యాహ్నం వరకు ఉక్కపోత అధికంగా ఉంది. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

రోజూ పురోగతి చూపాలి



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: 'నవరత్నాలు– పేదలందరికీ ఇల్లు' పథకం కింద జిల్లాలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాల అంశంలో రోజూ పురోగతి చూపాలని కలెక్టర్ ఎమ్.గౌతమి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలొస్తే పనులు మందగించే అవకాశం ఉన్నందున జులై రెండో వారానికి వీలైనంత ఎక్కువగా నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. పనుల వేగవంతానికి కూలీల సంఖ్య పెంచుకోవాలని సూచించారు.ఇసుక, సిమెంట్ తదితర సామగ్రి విషయంలో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ విషయంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రోజూ క్షేత్రస్థాయి అధికారులతో సమీక్షించుకుంటూ లక్ష్యాలు పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ కేశవనాయుడు, ఆర్‌డీఓ మధుసూదన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సోషల్ వెల్ఫేర్ డీడీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న మధుసూదన్‌రావు

అనంతపురం రూరల్: సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా మధుసూదన్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ డీడీగా పనిచేస్తున్న విశ్వమోహన్‌రెడ్డి శ్రీకాకుళం బదిలీ కాగా, ఆయన స్థానంలో మధుసూదన్‌రావును నియమిస్తూ ఉన్నతాధికారులు ఇటీవలే ఉత్తర్వులు ఇచ్చారు. గురువారం ఆయన బాధ్యతలు తీసుకోగా, సాంఘిక సంక్షేమశాఖ అధికారులు, వార్డెన్లు, నాల్గో తరగతి ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గోదాముల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయండి



మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్


అనంతపురం అర్బన్: జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఎంపీఎఫ్‌సీ (మల్టీ పర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్) గోదాముల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులతో జిల్లాస్థాయి భూమి తనిఖీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాటాడుతూ రైతుల ప్రయోజనాల కోసం చేపట్టిన గోదాముల నిర్మాణంలో జాప్యానికి తావివ్వరాదని చెప్పారు. ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశించిన వ్యవధిలో నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. రెండో దశ కింద చేపట్టిన 60 ఎంపీఎఫ్‌సీ గోదాముల నిర్మాణం ఏ దశలో ఉందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండల కమిటీలు సిఫారసు చేసిన 55 గోదాముల నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని ఆమోదించారు. ఎంపీఎఫ్‌సీ గోదాముల నిర్మాణం పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావడంపై ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలాయన చెప్పారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను పునఃప్రారంభిస్తాం



అనంతపురం సిటీ: మూతపడిన తపాలా శాఖ ఆధార్ కేంద్రాలను త్వరలో పునఃప్రారంభించనున్నట్లు ఆ శాఖ సూపరింటెండెంట్ వందాన హరిబాబు గురువారం తెలిపారు. ప్రస్తుతం ఆరు కేంద్రాలు మాత్రమే పని చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అనంతపురం కలెక్టరేట్, తాడిపత్రి, ఎస్‌పీ పురం, ఉరవకొండలోని పోస్టాఫీసుల్లో ఆధార్ కేంద్రాలను పునఃప్రారంభిస్తామని వెల్లడించారు. అనంతపురంలోని హెడ్ పోస్టాఫీసులో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ప్రస్తుతం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ తెరుస్తున్నట్లు తెలిపారు. రద్దీ ఎక్కువైతే ఉదయం నుంచి తెరిచి ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన ప్రకటించారు.

ప్రైవేటు ఫీజులుం



❐ అనంతపురం నగరానికి చెందిన మనోహర్ కుమారుడు సాయితేజ కోర్టు రోడ్డులోని ఓ ప్రైవేటు స్కూల్లో నాల్గో తరగతి పూర్తి చేశాడు. పాఠశాల యాజమాన్యం నుంచి పిలుపు రావడంతో విద్యార్థి తల్లిదండ్రులు ఇటీవల వెళ్లారు. సాయితేజ 5వ తరగతికి సంబంధించి పుస్తకాల కొనుగోలుకు రూ.12 వేలు చెల్లించాలని సిబ్బంది తెలిపారు. అంత చెల్లించలేమని, రెండు వేలైనా తగ్గించాలని మనోహర్ బతిమలాడినా ససేమీరా అన్నారు. చేసేది లేక వారు చెప్పినంతే కట్టాల్సి వచ్చింది.

❐ అనంతపురం కలెక్టరేట్ సమీపంలో సైనిక్ స్కూల్ పేరుతో నడిచే ఓ ప్రైవేటు స్కూల్లో నాల్గో తరగతి చదివే విద్యార్థుల పుస్తకాలకు రూ.11 వేల ధర నిర్ణయించారు. ఇదేమని ప్రశ్నిస్తే కసురుకుంటున్నారని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. "ఇక్కడింతే. ఇష్టమైతే చేర్పండి. ఎవరికి చెప్పుకున్నా మమ్మల్నేం చేయలేరు"ంటూ తెగేసి చెబుతున్నట్లు తెలిసింది.

- దారుణంగా ప్రైవేటు స్కూలు యాజమాన్యాల తీరు
- ప్రైమరీ విద్యార్థి ఫీజు రూ.70 వేల పైనే
- నాల్గో తరగతి పిల్లాడి పుస్తకాల ఖరీదు రూ.12 వేలు
- సైనిక్ స్కూళ్లు, సెమీ రెసిడెన్షియల్ అంటూ మరింత లాగుడు
- తల్లిదండ్రులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రైవేటు పాఠశాలల ఫీ'జులుం' పెరిగిపోయింది. ఐదారు టెక్స్ట్ బుక్కులు, ఐదు నోట్ పుస్తకాలు అందజేసి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అందినకాడికి లాగుతున్నారు. కనీసం రూ. 1,000 విలువ చేయని పుస్తకాలకూ రూ. 10 వేలు వసూలు చేస్తున్నారు. ఏడాదికి కట్టే ఫీజుకు సమానంగా పుస్తకాల ధర నిర్ణయించడంతో మధ్యతరగతి, సామాన్య కుటుంబాలు బెంబేలెత్తుతున్నాయి. మరో నాలుగు రోజుల్లో బడులు తెరుస్తున్న నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆయా సామగ్రి కొనుక్కోవడానికి తల తాకట్టు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇంజినీరింగ్ పుస్తకాలకంటే రేటు!

ఇంజినీరింగ్ చదివే విద్యార్థుల పుస్తకాల ఖరీదు సగటున ఏడాదికి రూ.7 వేలు కూడా ఉండదు. ప్రైవేటు పాఠశాలల్లో మాత్రం నాలుగో తరగతికే రూ.11 వేలు వసూలు చేస్తున్నారు. ఒక విద్యార్థిపై ఏడాదికి ఓ మాదిరి పాఠశాల అయితే రూ.50 వేల నుంచి రూ.60 వేలు వెచ్చించాల్సి వస్తోంది. దీనికితోడు రకరకాల ఫీజుల రూపేణా తల్లిదండ్రులను పిండేస్తున్నారు. సైనిక్ స్కూళ్లలో ప్రవేశాలు పొందేలా తర్ఫీదునిస్తామంటూ మరింత లాగుతున్నారు. సెమీ రెసిడెన్షియల్ పేరుతో అదనంగా రూ.20 వేలు తీసుకుంటున్నారు. పోనీ ఇంత డబ్బు తీసుకున్నా విద్యార్థులకేమైనా నేర్పిస్తున్నారా అంటే అదీ లేదు. ఒక్కో తరగతిలో 60 నుంచి 70 మందిని కుక్కేసి వాళ్లు ఏం వింటున్నారో, ఏం చదువుతున్నారో కూడా తెలియకుండా సాయంత్రానికి స్కూలు ముగుస్తున్న దుస్థితి.

పట్టని అధికారులు..

పాఠశాల ఫీజు మొదలు ప్రతి అంశంలోనూ తల్లిదండ్రులు దగాకు గురవుతున్నా, అరికట్టాల్సిన విద్యాశాఖ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లే వ్యవహరిస్తున్నారు. తల్లిదండ్రులెవరైనా ఫిర్యాదు చేస్తే ఆయా పాఠశాల యాజమాన్యాలతో హెచ్చరికలంటూ నాలుగు మాటలు మాట్లాడి వదిలేస్తున్నారు. ముందస్తుగా ఆయా ప్రైవేటు పాఠశాలల నుంచి డబ్బు వసూలు చేస్తుండడంతోనే చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రైవేటు స్కూళ్లలో ఫీజులు..పుస్తకాలు వివరాలు ఇలా

కేటగిరీ	ఫీజులు (సగటున)
డే స్కాలర్	రూ.40,000-రూ.50,000
హాస్టల్	రూ.1,00,000-రూ.1,50,000
పుస్తకాలు (5-10 తరగతి)	రూ.10,000-రూ.14,000
బస్సు-ఆటో ఛార్జీలు	రూ.10,000-రూ.12,000
యూనిఫాం, బ్యాడ్జీలు	రూ.3,000-రూ.5,000
బ్యాగులు, ఇతరత్రా కలిపి	రూ.4,000-రూ.5,000

శక్తికి మించి ఖర్చు చేస్తున్నాం..



"మా అమ్మాయి, అబ్బాయి ఇద్దరూ ప్రైవేటు స్కూల్లో చదువుతున్నారు. శక్తికి మించి ఫీజులు కట్టడమే కాకుండా అవసరం ఉన్నా లేకున్నా పుస్తకాలు, ప్రతిసారీ మార్చే యూనిఫారం కొనాల్సి వస్తుంది. గత ఏడాది మా అమ్మాయి ఎనిమిదో తరగతి పుస్తకాల కోసం రూ.11వేలు తీసుకున్నారు. –ఇ.మంజుల వాణి, గృహిణి

భరించలేక ప్రభుత్వ స్కూల్లో చేర్చా



నా కుమారుడు పవన్ ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నాడు. 8వ తరగతి వరకూ ప్రైవేటు స్కూల్లో చదివించా. రకరకాల ఫీజులంటూ పీల్చి పిప్పిచేశారు. ఫీజులు, పుస్తకాలు, రవాణా చార్జీలు భరించలేక 9వ తరగతి నుంచి ప్రభుత్వ స్కూల్లో చేర్పించా. – కేపీ రాజు, అనంతపురంవాసి

ఇష్టానుసారం వసూలు చేస్తే చర్యలు



ప్రైవేటు స్కూళ్ల ఫీజుల వ్యవహారం నా దృష్టికి వచ్చింది. ఎవరైనా రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే మాత్రం సంబంధిత పాఠశాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. పుస్తకాల పేరుతో ఇష్టానుసారం ఫీజులు వసూలు చేస్తే కఠినంగా వ్యవహరిస్తాం. కలెక్టర్ నుంచి కూడా స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. తనిఖీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. లేదంటే క్రమశిక్షణ చర్యలు ఉంటాయి. – ఎం. సాయిరామ్ డీఈఓ

నార్పలలో భారీ వర్షం

- 82.4 మి.మీ వర్షపాతం నమోదు
- జిల్లాకు మరో రెండు రోజులు వర్షసూచన




అనంతపురం అగ్రికల్చర్: నైరుతి రుతుపవనాల రాక కాస్త ఆలస్యమవుతున్నా తొలకర్లు మాత్రం జిల్లాను పలకరిస్తున్నాయి. నార్పలలో 82.4 మి.మీ భారీ వర్షం కురిసింది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకూ 15 మండలాల పరిధిలో 13.1 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. బుక్కరాయసముద్రం 53.2 మి.మీ, శింగనమల 50, గార్లదిన్నె 34.6, పామిడి 30.4, రాప్తాడు 28, వజ్రకరూరు 26.8, గుంతకల్లు 26.2, పెద్దవడుగూరు 22.4, అనంతపురం 20.2, గుత్తి 10.6 మి.మీ వర్షం పడింది. కూడేరు, యాడికి, పెద్దపప్పూరు, యల్లనూరు తదితర మండలాల్లోనూ వాన కురిసింది. గురువారం సాయంత్రం కూడా పలు మండలాల్లో వర్షపాతం నమోదైంది. జూన్ సాధారణం 61 మి.మీ కాగా ఇప్పటికే 24.5 మి.మీ నమోదైంది. రాగల రెండు రోజులు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.అశోక్‌కుమార్ తెలిపారు. ఈ నెల 15 నాటికి రుతుపవనాలు జిల్లాలోకి ప్రవేశించే అవకాశముందన్నారు.

ముగిసిన టెన్త్ ప్రధాన పరీక్షలు

రాప్తాడురూరల్: పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి గురువారం నాటికి ప్రధాన పరీక్షలు ముగిశాయి. చివరి రోజు సోషల్ పరీక్ష 49 కేంద్రాల్లో జరిగింది. మొత్తం 2,802 మంది విద్యార్థులకు గాను 1,827 మంది హాజరయ్యారు. 975 మంది గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ మూడు కేంద్రాలు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ మూడు కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల సభ్యులు 11 కేంద్రాలను పరిశీలించారు.

హెచ్చెల్సీకి 26.828 టీఎంసీలు!

- నీటి లభ్యత పెరిగితే కోటా పెంపు
- తుంగభద్ర బోర్డు సమావేశంలో నిర్ణయం



హెచ్చెల్సీ ప్రధాన కాలువ

అనంతపురం సెంట్రల్: తుంగభద్ర జలాశయం (టీబీ డ్యాం)లో ఈ ఏడాది కూడా ఆశాజనకంగా నీటి లభ్యత ఉంటుందని టీబీ బోర్డు అధికారులు అంచనా వేశారు. ఈ క్రమంలో హెచ్చెల్సీకి 26.828 టీఎంసీలు కేటాయించారు. తుంగభద్ర బోర్డు సమావేశం గురువారం వర్చువల్ విధానంలో జరిగింది. టీబీ డ్యాం ఎస్‌ఈ, మునీరాబాద్ ఎస్‌ఈ, కర్నూలు ఎస్‌ఈ, జిల్లా నుంచి హెచ్చెల్సీ ఎస్‌ఈ ఎన్. రాజశేఖర్ ఇందులో పాల్గొన్నారు. 2023–24 ఏడాదిలో ఆశాజనకంగానే వర్షాలు కురుస్తాయని, టీబీ డ్యాంలో 175 టీఎంసీల నీటి లభ్యత ఉంటుందని అంచనా వేశారు. ఆ లెక్కన హెచ్చెల్సీ, ఎల్‌ఎల్‌సీకి నీటి కేటాయింపులు చేశారు.

ముందుగానే నీరు!

ఇప్పటికే తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో ప్రారంభం కావడంతో ఈ ఏడాది హెచ్చెల్సీకి ఊహించిన సమయం కంటే ముందే నీరు విడుదల కానుంది. జిల్లాలోని రిజర్వాయర్లలో నీళ్ల నిల్వ ఉండడంతో ముందుగా ఆయకట్టుకు విడుదల చేయనున్నారు. ప్రస్తుతం తుంగభద్ర జలాశయానికి 1,041 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా 4.883 టీఎంసీలు మాత్రమే నీటి నిల్వ ఉంది. జిల్లాలోని పీఏబీఆర్‌లో 3.247 టీఎంసీలు, ఎంపీఆర్‌లో 0.690 టీఎంసీలు, సీబీఆర్‌లో 7.117 టీఎంసీలు, చాగల్లులో 0.820 టీఎంసీలు, పెండేకల్లులో 0.17 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

లభ్యత పెరిగితే కోటా పెంపు

నాలుగేళ్లుగా ఆశించిన స్థాయిలో వర్షాలు కురుస్తున్నాయి. ఈ ఏడాది కూడా మంచి వర్షాలు పడతాయని అంచనా వేస్తున్నారు. టీబీ జలాశయంలో 175 టీఎంసీల నీటి లభ్యత ఉండవచ్చని అంచనాకొచ్చాం. ఈ లెక్కన దామాషా ప్రకారం 26.828 టీఎంసీలు హెచ్చెల్సీకి కేటాయించారు. నీటి లభ్యత పెరిగితే కోటా కూడా పెరుగుతుంది. జిల్లాలోని జలాశయాల్లో ఇప్పటికే నీరు నిల్వ ఉండడంతో ఆయకట్టుకు త్వరగా నీరు అందనుంది. నిజంగా ఇది శుభపరిణామమే.
– రాజశేఖర్, ఎస్‌ఈ, హెచ్చెల్సీ

హెచ్‌ఎంల బదిలీలు పూర్తి

- 41 మందికి పదోన్నతి
- 18 మందికి పాత స్థానాలే

రాప్తాడురూరల్: ఎట్టకేలకు టీచర్ల బదిలీల్లో తొలి అంకం పూర్తయింది. షెడ్యూలు ప్రకారం శుక్రవారం తయారు కావాల్సిన ప్రధానోపాధ్యాయుల జాబితా ప్రక్రియ ఒకరోజు ముందుగా గురువారమే పూర్తయింది. జాబితాను ఉదయం ఆన్‌లైన్‌లో ఉంచి, వెంటనే పాతస్థానాల్లో రిలీవ్ అయి కొత్త స్థానాల్లో చేరిపోవాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. స్కూల్ అసిస్టెంట్ల బదిలీల జాబితా శుక్రవారం విడుదలయ్యే అవకాశం ఉంది.

18 మందికి పాతస్థానాలే

మొత్తం 267 మంది ప్రధానోపాధ్యాయులు ఆప్షన్లు ఇచ్చుకున్నారు. స్కూల్ అసిస్టెంట్ల నుంచి హెచ్‌ఎంలుగా పదోన్నతి పొందిన 41 మంది ఆప్షన్లు ఇచ్చారు. మొత్తం 308 మంది ఆప్షన్లు ఇవ్వగా, 290 మంది ఆర్డర్లు జనరేట్ చేశారు. తక్కిన 18 మంది హెచ్‌ఎంలకు రిటైన్ (పాతస్థానాలు) చేశారు. బదిలీలు పొందిన వారిలో 8 మంది ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు కాగా, 241 మంది ఇతర యాజమాన్యాల పాఠశాలల హెచ్‌ఎంలు.

నేడు మ్యూజిక్, క్రాఫ్ట్, ఒకేషనల్ టీచర్లకు కౌన్సెలింగ్

జిల్లాలో వివిధ స్కూళ్లలో పని చేస్తున్న మ్యూజిక్, క్రాఫ్ట్, ఒకేషనల్ టీచర్లకు శుక్రవారం ఆఫ్‌లైన్ విధానంలో కౌన్సెలింగ్ ఉంటుంది. ఉదయం 9 గంటలకు స్థానిక సైన్స్ సెంటర్‌కు చేరుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరామ్ తెలిపారు.

డబ్బు గుంజినా బిడ్డపై నిర్లక్ష్యం!



స్నేహలత ఆస్పత్రి గైనకాలజిస్టు డాక్టర్ శివజ్యోతిని ప్రశ్నిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి

- బాధితుల ఫిర్యాదుతో స్నేహలత ఆస్పత్రి నిర్వాహకులకు షోకాజ్

అనంతపురం క్రైం: నగరంలోని స్నేహలత ఆస్పత్రి, కమలానగర్‌లోని ఓవీఆర్ డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వాహకులకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తాను గర్భం దాల్చినినాటి నుంచి బిడ్డ ప్రసవం జరిగే వరకూ రూ.వేలల్లో డబ్బు వసూలు చేసి కూడా చిన్నారి ఆరోగ్యంపై స్పష్టత ఇవ్వకుండా స్నేహలత ఆస్పత్రి వైద్యులు నిర్లక్ష్యం చేశారని అనంతపురం నగర శివారు కళ్యాణదుర్గం రోడ్డు బాలాజీ విల్లాస్ సమీపంలో ఉండే పద్మావతి కలెక్టర్ గౌతమికి ఈ నెల 5న స్పందనలో ఫిర్యాదు చేశారు. తాను గర్భం దాల్చినప్పటి నుంచి స్నేహలత ఆస్పత్రిలో డాక్టర్ శివజ్యోతికి చూపించుకున్నానని, ఆమె ఆదేశాల మేరకు ఓవీఆర్ డయాగ్నస్టిక్ వైద్యుడు స్కాన్ చేశారని పేర్కొన్నారు. స్కాన్ చేసిన ప్రతిసారి డాక్టర్ శివజ్యోతి, రేడియాలజిస్టులిద్దరూ బిడ్డ ఆరోగ్యంగా ఉందని రిపోర్టు ఇచ్చారని, తీరా బిడ్డ జన్మించాక చూస్తే పెదవి సరిగా లేదని తెలిసిందని వినతిపత్రంలో వాపోయారు. దీంతో బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చూపించుకోవాల్సి వచ్చిందన్నారు. చిరుద్యోగులైన తమ నుంచి స్నేహలత ఆస్పత్రిలో రూ.వేలు వసూలు చేశారని, విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని మొరపెట్టుకున్నారు. దీంతో స్పందించిన కలెక్టర్ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయిను ఆదేశించారు. ఆ మేరకు గురువారం డీఎంహెచ్‌ఓ వీరబ్బాయి, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ యుగంధర్, డెమో భారతి నగరంలోని స్నేహలత ఆస్పత్రి గైనకాలజిస్టు డాక్టర్ శివజ్యోతి, ఓవీఆర్ డయాగ్నస్టిక్ నిర్వాహకులు డాక్టర్ హరీష్‌తో వేర్వేరుగా మాట్లాడారు. కలెక్టర్‌కు పద్మావతి అందజేసిన వినతిపత్రంలోని అన్ని వివరాలపై ఆరా తీశారు. అనంతరం వారికి షోకాజ్ నోటీసు అందజేసి, 24 గంటల్లోపు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని ఆదేశించారు.

సెల్‌ఫోన్ మరమ్మతు శిక్షణ

అనంతపురం: రూడ్‌సెట్ సంస్థలో గ్రామీణ నిరుద్యోగులకు ఉచితంగా సెల్‌ఫోన్ మరమ్మతు, ఫొటోగ్రఫీపై శిక్షణ కల్పిస్తున్నట్లు డైరెక్టర్ కనకేశ్వరుడు తెలిపారు. జూలై 1 నుంచి 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఉచితంగా భోజన, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. 19 నుంచి 35 సంవత్సరాల్లోపు ఉండి, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు కలిగిన వారు అర్హులన్నారు. 9618876060, 9440905479, 08554–255925 నంబర్లలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

● థ్యాంక్యూ సీఎం సార్



కళ్యాణదుర్గంలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఒప్పంద ఉద్యోగులు

కళ్యాణదుర్గం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయాలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఒప్పంద పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న తమను క్రమబద్ధీకరించేందుకు నిర్ణయం తీసుకోవడంతో గురువారం కళ్యాణదుర్గంలో కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎన్జీఓస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. తమ బాధలను ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఎన్నికల ముందు సీఎం జగన్ ప్రకటించిన మేరకు రెగ్యులర్ చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు జాన్‌సన్, తాలూకా అధ్యక్షుడు చెన్నారెడ్డి, డివిజన్ పరిధిలోని కాంట్రాక్టు ఉద్యోగులు నరసారెడ్డి, వీరశేఖర్, పురుషోత్తం, రాయుడు, గోవిందరాజులు, నారాయణ, ఆర్దర్‌బాబు పాల్గొన్నారు.

- ఒప్పంద ఉద్యోగుల 'శాశ్వతా'నందం
- పరిహారం విడుదలతో రైతన్నల సంతోషం



పుట్లూరు: ఓబుళాపురంలో రైతుల ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

పరిహారం అందించడంపై రైతులు..

పుట్లూరు: ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రెండు నెలలకే ప్రభుత్వం నుంచి పరిహారం అందడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఏ ప్రభుత్వమూ ఇంత త్వరగా చర్యలు తీసుకోలేదంటూ సంతోషం వెలిబుచ్చారు. గురువారం పుట్లూరు మండలంలోని ఓబుళాపురంలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి సంబరాలు చేసుకున్నారు. రైతుల మేలు కోరే ప్రభుత్వానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని స్పష్టం చేశారు. నష్టాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిహారం మంజూరయ్యేలా చూసిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎంను కలిసిన మంత్రి ఉషశ్రీచరణ్



కళ్యాణదుర్గం: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధిని వివరించారు. అనంతరం కళ్యాణదుర్గానికి చెందిన పలువురు నాయకులను పరిచయం చేశారు. రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని వారికి సీఎం సూచించినట్లు మంత్రి తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యాన్ని చూపుతున్న విజిలెన్స్ అధికారులు

బొమ్మనహాళ్: అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకన్నారు. వివరాలు.. అందిన ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన విజిలెన్స్ సీఐ రామారావు, ఎఫ్ఆర్‌ఓ యామినీసరస్వతి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ భోగన్‌గౌడ్ తదితరులు గురువారం ఉదయం గోవిందవాడ క్రాస్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన మినీ లారీని ఆపి తనిఖీ చేయగా 41 క్వింటాళ్ల రేషన్ బియ్యం బయటపడింది. దీంతో ఆ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేశారు. బియ్యం తరలిస్తున్న కర్ణాటకలోని బళ్లారికి చెందిన బసవరాజు, నవీన్, యువరాజు, వాహన డ్రైవర్ అయ్యప్పస్వామిపై ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ 1955 సెక్షన్ 6(ఏ) కింద కేసు నమోదు చేశారు.

అంజూర సాగు.. లాభాలు బాగు

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం
- డ్రైఫూట్స్‌గా మార్చి మూడు రాష్ట్రాలకు ఎగుమతి
- నాలుగు ఎకరాల్లో ఏడాదికి రూ.15 లక్షల ఆదాయం
- ఆదర్శంగా నిలిచిన రైతు రమేష్‌నాయుడు



అంజూర పండ్లను ఎండబెట్టిన దృశ్యం



అంజూర కాయలు

పెద్దపప్పూరు: వినూత్న ఆలోచనతో వివిధ రకాల పంటసాగు చేస్తే అధిక దిగుబడులు సాధ్యమని నిరూపించాడు ఉమ్మడి అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలానికి చెందిన రైతు రమేష్‌నాయుడు. కష్టపడితే సాధించలేనిది ఏది లేదు అంటూ అందుబాటులో ఉన్న టెక్నాలజీ సాయంతో అధిక లాభాలను గడిస్తున్నాడు.

అరుదైన రకం.. అమెరికా నుంచి దిగుమతి

మార్కెట్‌లో అంజూర పండ్లకున్న డిమాండ్‌ను తెలుసుకున్న పెద్దపప్పూరు మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన రైతు రమేషనాయుడు.. వెంటనే ఆ పంట సాగుపై దృష్టిసారించాడు. తన సోదరుడి సాయంతో అమెరికాలో సాగులో ఉన్న డయానా రకం అంజూర పంటపై ప్రత్యేకంగా అధ్యయనం చేశాడు. ప్రస్తుతం జిల్లాలో అందుబాటులో ఉన్న అంజూర మొక్కల రకాల కంటే డయానా రకంలో మేలైన దిగుబడులు ఉండడంతో ఏడేళ్ల క్రితం అమెరికా నుంచి మొక్కలు దిగుమతి చేసుకున్నాడు. అనంతరం తనకున్న నాలుగు ఎకరాల్లో అంజూరా సాగు చేపట్టాడు.

తక్కువ పెట్టుబడి.. అధిక లాభం

అంజూర సాగు కోసం రైతు రమేష్‌నాయుడు తొలుత రూ.2 లక్షలను పెట్టుబడిగా పెట్టాడు. పంట కాపు చేతికి వచ్చిన తొలి ఏడాదిలోనే పెట్టుబడి మొత్తం చేతికి అందింది. ఆ తర్వాత మార్కెట్‌లో ధరల హెచ్చుతగ్గులను బట్టి ఏటా ఎకరాకు రూ.లక్ష చొప్పున రూ.4 లక్షలు ఆదాయాన్ని గడిస్తున్నాడు.

డ్రైఫ్రూట్స్‌గా మారిస్తేనే లాభం



పండిన పంటను అలాగే మార్కెట్‌కు తరలిస్తే కిలో రూ.60 నుంచి రూ.80 చొప్పున అమ్ముడు పోతోంది. అదే పంటను డ్రైఫ్రూట్స్‌గా మార్చి కిలో రూ.800 నుంచి రూ.వెయ్యి వరకూ విక్రయిస్తున్నా. దీంతో ఏటా రూ.15లక్షలకు పైగా ఆదాయం వస్తోంది. సేంద్రీయ ఎరువులను వినియోగించడం వల్ల దిగుబడిలో నాణ్యత ఉంటోంది.

– రైతు రమేష్‌నాయుడు, ధర్మాపురం, పెద్దపప్పూరు మండలం

డ్రై ఫ్రూట్స్‌గా మార్చి... మరింత ఆదాయం



సరఫరా కోసం ప్యాకింగ్ చేసిన డ్రైఫూట్స్

ప్రస్తుతం మార్కెట్‌లో కిలో అంజూర రూ.60 నుంచి రూ.80తో అమ్ముడు పోతోంది. అయితే పండు రూపంలో విక్రయించడం కంటే వాటిని ఎండబెట్టి డ్రై ఫ్రూట్స్‌గా అమ్మకాలు చేపడితే మరింత లాభాలు ఉంటాయని తెలుసుకున్న రమేష్‌నాయుడు వెంటనే ఆ దిశగా చర్యలు చేపట్టాడు. రూ. 2 లక్షలు వెచ్చించి పాలిథిన్ కవర్‌తో ఓ షెడ్డు ఏర్పాటు చేసి అందులో అంజూర పండ్లను డ్రైఫూట్స్‌గా మార్చి కిలో రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు ఏపీలోని వివిధ జిల్లాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాలకూ ఎగుమతి చేయడం మొదలు పెట్టాడు. అంతటితో ఆగకుండా అంజూర చెట్లకు అంటుకట్టి ఒక్కొక్క మొక్కను రూ.8 నుంచి రూ.10 చొప్పున రైతులుకు విక్రయిస్తున్నాడు.

వంచకుడిపై కేసు నమోదు

ఉరవకొండ: దివ్యాంగురాలిని ప్రేమ పేరుతో నమ్మించి రూ.లక్షలు దోచుకున్న వంచకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ హరినాథ్ తెలిపిన మేరకు.. ఉరవకొండ మండలం రాయంపల్లికి చెందిన ఓ దివ్యాంగురాలితో పరిచయం పెంచుకున్న నెరిమెట్ల గ్రామానికి చెందిన వీరారెడ్డి కుమారుడు ప్రవీణ్‌రెడ్డి... తొమ్మిదేళ్లుగా ఆమెను ప్రేమ పేరుతో లోబర్చుకున్నాడు. భవిష్యత్తు అవసరాల కోసం ఆమె దాచుకున్న రూ.10 లక్షలను తన సొంతానికి వాడుకున్నాడు. ఇటీవల పెళ్లి చేసుకోవాలని ఆమె కోరడంతో ముఖం చాటేశాడు. దీంతో తాను మోసపోయినట్లుగా గుర్తించిన ఆమె ఈ నెల 1న ఎస్పీ కె.శ్రీనివాసరావును కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసింది. అనంతరం గురువారం ఉరవకొండ అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీసీ బస్సులో రూ.7 లక్షలు మాయం

గుత్తి: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి బ్యాగ్‌లో నుంచి రూ. లక్షలను గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకెళ్లాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంటూరు జిల్లా నరసాపురం పట్టణానికి చెందిన శ్రీనివాసరావు తన వ్యాపార నిమిత్తం స్నేహితులతో కలసి బుధవారం రాత్రి గుంటూరు నుంచి ఆర్టీసీ బస్సులో అనంతపురానికి బయలుదేరాడు. గుత్తి దాటిన తర్వాత తన బ్యాగ్‌ను పరిశీలించుకున్న ఆయన అందులో ఉంచిన రూ.7 లక్షలు కనిపించక పోవడంతో ఆందోళనకు గురయ్యాడు. పలువురిని ఆరా తీసిన అనంతరం చోరీకి గురైనట్లు గుర్తించి గురువారం ఉదయం గుత్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

బిందు సేద్యంతో లాభాలు

కుందుర్పి: బిందు సేద్యంతో లాభాలు పుష్కలంగా ఉంటాయని రైతులకు ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్ సూచించారు. కుందుర్పి మండలం అప్పిలేపల్లిలో బిందుసేద్యంతో రైతులు చేపట్టిన పండ్ల తోటల సాగును గురువారం ఆయన పరిశీలించారు. రైతులకు సబ్సిడీపై బిందు, తుంపర సేద్యం పరికరాలను ప్రభుత్వం అందజేస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 12వేల హెక్టార్లకు సంబంధించి చిన్న సన్నకారు రైతులతో పాటు 10 ఎకరాలున్న రైతులకు సైతం పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. బిందు సేద్యంపై ఆసక్తి ఉన్న రైతులు వెంటనే దరఖాస్తులను అందజేయాలని కోరారు. సర్పంచ్ అతావుల్లా, తిప్పేస్వామి, ఓబుళపతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు కానిస్టేబుళ్లపై వేటు

- గంజాయి స్మగ్లర్ పరారీకి సంబంధించి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పోలీసుల కళ్లుగప్పి గంజాయి స్మగ్లర్ పరారైన అంశానికి సంబంధించి ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అనంతపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై వెళ్లిన కానిస్టేబుల్ మోహన్ ఈ నెల 1వ తేదీ మధ్యాహ్నం రాప్తాడు పోలీస్ స్టేషన్‌లో రిపోర్టు చేసుకున్నారు. ఉన్నతాధికారి ఆదేశాలతో 2వ తేదీ సెంట్రీ డ్యూటీకి హాజరయ్యాడు. అప్పటికే పోలీసుల అదుపులో గంజాయి తరలిస్తూ పట్టుబడిన యువకుడు ఉన్నాడు. రాత్రి 1 గంటకు నిందితుడిని ఓ కంట కనిపెట్టాలంటూ కానిస్టేబుల్ శ్యామ్‌కు అప్పగించి సెట్ తీసుకుని ఓ గదిలోకి వెళ్లి అరగంట తర్వాత తిరిగి వచ్చాడు. ఈ లోపు అందుబాటులో ఉన్న సబ్బు ముక్కను నీటిలో తడిపి చేతులకు పూసుకుని బేడీలను తొలగించుకున్న నిందితుడు స్టేషన్ నుంచి బయటపడ్డాడు. ఆ సమయంలో అలకిడి కావడంతో అప్రమత్తమైన శ్యామ్ వెంటనే నిందితుడిని నిలువరించేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. కాసేపటికి అక్కడకు చేరుకున్న గస్తీ జీపులోని సిబ్బందితో కలసి నిందితుడి ఆచూకీ కోసం గాలించినా ఫలితం దక్కలేదు. దీంతో విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించి, నిందితుడు తప్పించుకుని పోయేందుకు కారణమయ్యారంటూ కానిస్టేబుళ్లు మోహన్, శ్యామ్‌ని సస్పెండ్ చేస్తూ జిల్లా ఉన్నతాధికారి ఆదేశాలు జారీ చేశారు.

చేతిని కోల్పోయిన ప్రయాణికురాలు



రోడ్డుపై తెగిపడిన సుధ కుడి చేయి

పెద్దవడుగూరు: డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా ఓ ప్రయాణికురాలు తన కుడిచేతిని కోల్పోయింది. వివరాలు.. గురువారం ఉదయం గుత్తి నుంచి తాడిపత్రికి బయలుదేరిన కర్ణాటక ఆర్టీసీ బస్సులో కర్ణాటకలోని కార్వర్ జిల్లా యల్లాపూర్‌కు చెందిన సుధ ప్రయాణిస్తోంది. బస్సు వెనుక సీటులో కుడివైపున కూర్చొన్న ఆమె తన కుడిచేతిని కిటికీ నుంచి బయటకు పెట్టింది. విషయాన్ని గమనించిన డ్రైవర్ ఆమెను అప్రమత్తం చేయడం మరిచాడు. అప్పటికే పెద్దవడుగూరు మండలం వీరేపల్లి వద్దకు చేరుకున్న బస్సుకు అతి సమీపంలో తాడిపత్రి నుంచి గుత్తి వైపుగా వెళుతున్న లారీ దూసుకెళ్లింది. ఘటనలో సుధ కుడి చెయ్యి తెగి రోడ్డు పక్కన పడింది. ప్రయాణికులు ఒక్కసారిగా గట్టిగా కేకలు వేయడంతో డ్రైవర్ వెంటనే బస్సు ఆపాడు. క్షతగాత్రురాలిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పెద్దవడుగూరు ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నిర్వాసితులను ఆదుకుంటాం

- రైల్వే లైన్ ఏర్పాటులో ఇళ్లు కోల్పోతున్న వారికి జేసీ కేతన్ గార్గ్ భరోసా



మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్

రాయదుర్గం: రైల్వే లైన్ ఏర్పాటులో భాగంగా ఇళ్లు కోల్పోతున్న ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని జేసీ కేతన్‌గార్గ్ భరోసానిచ్చారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని రాయదుర్గం – తుమకూరు (కర్ణాటక) మధ్య డబుల్ ట్రాక్ (రెండు లైన్ల మార్గం) ఏర్పాటుకు రైల్వే అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో రెండో ట్రాక్ ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ చేపట్టాలని కలెక్టర్‌కు రైల్వే అధికారులు విన్నవించడంతో కళ్యాణదుర్గం ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి, ట్రైనీ కలెక్టర్ ప్రశాంత్, తహసీల్దార్ మారుతి, మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ కిషోర్‌తో కలసి జేసీ కేతన్‌గార్గ్ గురువారం ఉదయం రాయదుర్గంలోని చంద్రబాబు కాలనీలో పర్యటించారు. రెండో లైన్ ఏర్పాటుకు రూపొందించిన మ్యాప్‌ను రైల్వే ఇంజినీర్లతో కలసి పరిశీలించారు. కాలనీలో ఉన్న సుమారు 250 ఇళ్లకుగాను 94 గృహాలు తొలగించాల్సి వస్తోందని అధికారులు వివరించారు. దీంతో ఆ ఇళ్లను, వారికిచ్చిన పట్టాలను జేసీ తనిఖీ చేశారు. అయితే అక్కడ నివాముంటున్న వారు నష్టపోకుండా కాలనీకి ఆనుకుని ఉన్న భూమిని పరిశీలించాలని రైల్వే ఇంజినీర్లకు సూచించారు. అవసరమనుకుంటే ఆ భూమికి పైభాగాన ఉన్న స్థలాన్ని కూడా కేటాయిస్తామన్నారు. ఎక్కడా సరిపడక ఇదే స్థలం కావాలంటే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించి వారి ఆదేశాల మేరకు సరైన నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆ సమయంలో స్థానికులు పలువురు జేసీని కలసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. నిరుపేదలమైన తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. దీంతో అందరి ఆమోదయోగ్యం మేరకే నిర్ణయం తీసుకుంటామని భరోసానిచ్చారు. అనంతరం జగనన్న కాలనీల్లో చేపట్టిన గృహనిర్మాణలను జేసీ పరిశీలించారు. ఈ నెలాఖరుకు నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఏర్పాట్లు పకడ్బందీగా...

- సీఎస్, డీఓలకు డీఈఓ సాయిరామ్ ఆదేశం
- మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష నిర్వహణపై సమీక్ష

రాప్తాడురూరల్: మోడల్ స్కూళ్లలో 6వ తరగతి ప్రవేశానికి ఈనెల 11న నిర్వహించే రాత పరీక్షకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ఎం.సాయిరామ్ ఆదేశించారు. గురువారం నగరంలోని కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్), డిపార్ట్‌మెంటల్ అధికారుల (డీఓ)తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ప్రశ్నపత్రాలను శుక్రవారం ఆయా పోలీసు స్టేషన్లకు తరలిస్తామన్నారు. పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాల కల్పనతో పాటు మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్, ఏడీ కృష్ణయ్య, సూపరింటెండెంట్ సరళ కుమారి, సీనియర్ అసిస్టెంట్ రామాంజినేయులు పాల్గొన్నారు.

స్కూళ్లు తెరిచేనాటికి సరుకులుండాలి

పాఠశాలలు ప్రారంభయ్యేలోపు బెల్లం, బియ్యం, రాగిపిండి తదితర సరుకులు సిద్ధంగా ఉంచుకోవాలని డీఈఓ ఎం.సాయిరామ్ ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏ ఒక్క పాఠశాలలోనూ కోడిగుడ్లు, చిక్కీలు, రాగిపిండి, బెల్లం సరఫరా కాలేదనే ఫిర్యాదు రాకూడదని స్పష్టం చేశారు.

సజావుగా ఎన్నికల ప్రక్రియ

- రాయదుర్గంలో కోరం లేక వైస్ ఎంపీపీ ఎన్నిక వాయిదా

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల స్థానాల్లో ప్రజాప్రతినిధుల ఎన్నిక ప్రక్రియ గురువారం సజావుగా సాగింది. ఎన్నికైన వారందరూ వైఎస్సార్ సీపీ నుంచి గెలుపొందిన వారే. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆయా ప్రాంత పోలీస్ అధికారులు బందోబస్తు నిర్వహించారు. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి ఎంపీపీగా బగ్గిరి త్రివేణ ని ఎన్నుకున్నారు. ఆమె అప్పరాచెరువు ఎంపీటీసీ సభ్యురాలిగా గతంలో గెలుపొందారు.

- విడపనకల్లు మండల ఉపాధ్యక్షురాలు-2గా రాకెట్ల పుష్పావతి ఎన్నికయ్యారు. ఆమె హాంచనహాళ్ ఎంపీటీసీగా గతంలో విజయం సాధించారు.
- చెన్నేకొత్తపల్లి వైస్ ఎంపీపీ-1గా పి.రాములమ్మను ఎన్నుకున్నారు. ఆమె చెన్నేకొత్తపల్లి-2 ఎంపీటీసీగా గెలుపొంది ఉన్నారు.
- తనకల్లు మండల కో–ఆప్షన్‌గా కె.రహంతుల్లాను ఎన్నుకున్నారు. ఈ మేరకు ఎన్నికైన పైన పేర్కొన్న వారందరికీ ఆయా మండల ఎన్నికల అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.
- రాయదుర్గంలో కోరం లేక వైస్ ఎంపీపీ ఎన్నికను ఎన్నికల అధికారి వాయిదా వేశారు.

అ'ధనం' వద్దు

- సిలిండర్ సరఫరా చార్జీ నిర్దేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



అనంతపురం అర్బన్: వంటగ్యాస్ సిలిండర్ డెలివరీ చేసినందుకు డబ్బు వసూలు చేయకూడదని ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. నగర, నగర పంచాయతీ పరిధిలో ఎంత దూరమైన ఉచితంగా సరఫరా చేయాలి. అలాగే మున్సిపాలిటీ పరిధిలో 15 కిలోమీటర్ల పరిధిలోని వినియోగదారులకు ఉచితంగా అందజేయాలి. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి ఏజెన్సీ నుంచి 15 కిలోమీటర్ల దూరం వరకు, కొండలు, అటవీ గిరిజన ప్రాంతాలు, తక్కువ జనాభా ఉన్న గ్రామాలకు పూర్తి ఉచితంగా గ్యాస్ సిలిండ్లను సరఫరా చేయాలి. ఈ ఆదేశాలను ఉల్లంఘించే ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. ప్రభుత్వ నిర్దేశించిన దాని కంటే ఎక్కువ దూరం సరఫరా చేసినప్పుడే వినియోగదారుల నుంచి డెలివరీ చార్జీ వసూలు చేయడానికి గ్యాస్ పంపిణీదారులకు అనుమతి ఇచ్చింది.

అదనంగా వసూలు చేస్తే చర్యలు

సిలిండర్ సరఫరాకు అదనంగా డబ్బు వసూలు చేయకూడదు. డెలివరీ బాయ్స్ డిమాండ్ చేస్తే సంబంధిత తహసీల్దార్లకు లేదా జిల్లా సరఫరాల అధికారికి ప్రజలు ఫిర్యాదు చేయాలి. నిబంధనలను ఉల్లంఘించే గ్యాస్ ఏజెన్సీలపై అధికారులతో విచారణ చేయించి చర్యలు తీసుకుంటాం.

– కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్

జిల్లాలో స్టాంపుల కొరత



అనంతపురం టౌన్: జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాంపుల కొరత తీవ్రంగా ఉంది. 10 రోజులుగా రూ.100, రూ.50 స్టాంపులు లభ్యం కాక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నట్లు సమాచారం. దీంతో స్థిరాస్తుల క్రయ, విక్రయదారులు స్టాంపుల కోసం ఇతర జిల్లాలకు పరుగులు తీస్తున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు నాలుగు నెలల క్రితమే జిల్లా ప్రధాన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఓ ఫ్రాంకింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఈ యంత్రాన్ని వినియోగించుకోకుండా మూలన పెట్టేయడంతో స్టాంపుల కొరత తీవ్రమైంది.

ఈ–స్టాంపింగ్‌పై సారించని దృష్టి

స్టాంపుల కొరతను తగ్గించేందుకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు ఈ–స్టాంపింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. జిల్లాలోని కొందరు స్టాంప్ వెండర్లకు ఈ–స్టాంపింగ్ లైసెన్సులను సైతం జారీ చేశారు. అయితే ఈ స్టాంపింగ్‌పై వినియోగదారులను చైతన్య పరచడంలో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు దృష్టి సారించలేకపోయారు. దీంతో ఈ–స్టాంపింగ్‌ను వినియోగదారులు విశ్వసించడం లేదు. విద్యావంతులైన కొందరు వినియోగదారులు ఈ–స్టాంపింగ్ వైపు మొగ్గు చూపినా.. అనుమతి పొందిన విక్రయదారులు వాటిని అధిక ధరకు విక్రయిస్తుండడంతో వారు సైతం ఈ విధానంపై ఆసక్తి చూపడం లేదు. రూ.100 ఈ–స్టాంపింగ్‌కు రూ.160కు పైగా వసూలు చేస్తున్నట్లు సమాచారం.

సర్దుబాటు చేస్తాం

స్టాంపుల కొరతపై జిల్లా రిజిస్ట్రార్ నాగభూషణం మాట్లాడుతూ.. రూ.100 స్టాంపుల కొరత ఉన్న మాట వాస్తవమేనని ధ్రువీకరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి జిల్లాకు అవసరమైన స్టాంపుల ఇండెంట్‌ను అందజేసినట్లు వివరించారు. మరో రెండు, మూడు రోజుల్లో స్టాంపులు జిల్లాకు చేరే అవకాశముందన్నారు. అప్పటి వరకూ జిల్లాలోని రూరల్ కార్యాలయాల పరిధిలో ఉన్న రూ.100, రూ.50 స్టాంపులను సర్దుబాటు చేస్తామని భరోసానిచ్చారు.

ఏపీఐఐసీ భూముల పరిశీలన



తిమ్మసముద్రం వద్ద భూములను పరిశీలిస్తున్న అధికారులు

కళ్యాణదుర్గం: మండలంలోని తిమ్మసముద్రం సమీపంలో ఉన్న ఏపీఐఐసీ భూములను గురువారం జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, ఆర్డీఓ నిశాంత్ రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ వరప్రసాద్, తహసీల్దార్ ఫణి కుమార్, సర్పంచు శ్రీనివాసులు పరిశీలించారు. మొత్తం 1,097 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు.

జాతీయ స్థాయిలో పతకాల సాధన

అనంతపురం: జార్ఖండ్‌లోని రాంచీ వేదికగా ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో అనంతపురం క్రీడాకారులు 9 పతకాలు సాధించారు. పతకాలు సాధించిన లావిష్ రెడ్డి, ధన్విత్, లెహత్‌సాయి, హంజా హుస్సేన్, కార్తీక్‌ను గురువారం జిల్లా చీఫ్ కోచ్ జగన్నాథరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు పి.నాగేంద్ర, ఆంజినేయులు, అనిల్‌కుమార్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న చీఫ్ కోచ్ జగన్నాథరెడ్డి

క్లుప్తంగా

గురు పౌర్ణమి వేడుకలకు శ్రీకారం


ప్రసాద వితరణ చేస్తున్న నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: వచ్చేనెల 3న జరగనున్న గురు పౌర్ణమి వేడుకలను శ్రీషిర్డీసాయి అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. గురువారం ఉదయం టవర్‌క్లాక్ సమీపంలో షిర్డీసాయినాథుని ఉత్సవ విగ్రహం పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. వందలాది మందికి ప్రసాద వితరణ చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఏటా షిర్డీ క్షేత్రంలో అనంత తరఫున దాదాపు లక్షా 50 వేల మందికి అన్నదానం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అన్నదాన సేవా సమితి ప్రతినిధులు సుబ్రమణ్యం, శ్రీనివాసులు, బళ్లారి వెంకటరాముడు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జీవితంపై కవితలకు ఆహ్వానం

అనంతపురం కల్చరల్: మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు జీవితంపై కవితల పోటీలకు ఆహ్వానిస్తున్నట్లు తెలుగు రక్షణ వేదిక జాతీయ అధ్యక్షుడు పొట్లూరి హరికృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. వెండితెర వేల్పుగా కీర్తిగాంపబడిన ఎన్టీఆర్ సినిమా, రాజకీయ, సమాజసేవ ఇతివృత్తంగా 'శక సార్వభౌమ' పేరుతో వచ్చే కవితా సంకలనంలో ఎంపికైన కవితలను ప్రచురిస్తామన్నారు. ఆసక్తి కలిగిన రచయితలు, కవులు తమ కవితలను ఈనెల 15 లోపు సెల్: 9000066889 వాట్సాప్‌నకు పంపాలన్నారు.

భూముల మార్కెట్ విలువను తగ్గించాలి


జేసీ కేతన్‌గార్గ్‌కు సమస్యను విన్నవించుకునేందుకు వచ్చిన నగరవాసులు

అనంతపురం అర్బన్: అనంతపురం అర్బన్, రూరల్ పరిధిలో అధికంగా పెంచిన భూముల మార్కెట్ విలువను తగ్గించాలని జేసీ కేతన్‌గార్గ్‌కు నగరవాసులు ప్రసాదరెడ్డి, ఆదినారాయణ, తదితరుల విన్నవించారు. జేసీని గురువారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం సమర్పించి, సమస్య వివరించారు. భూముల మార్కెట్ విలువను 10 శాతం నుంచి 30 శాతం వరకు పెంచాలని ప్రభుత్వం జీవో జారీ చేసిందని చెప్పారు. అయితే జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఏకంగా 200 శాతం నుంచి 500 శాతం వరకు మార్కెట్ విలువను పెంచారన్నారు. దీంతో రైతులు వ్యవసాయ భూములను, నగరంలో ప్లాట్లను, ఇళ్లను కొనుదలిచిన వారిపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందన్నారు.

మందులు అందుబాటులో ఉంచండి

ఆత్మకూరు: పశువులకు సంబంధించిన అన్ని రకాల మందులను అందుబాటులో ఉండేలా చూడాలని ఎంపీపీ సుబ్బర హేమలత పశు వైద్యుడు దిలీప్‌కు తెలియజేశారు. గురువారం పంపనూరు గ్రామంలోని పశువుల ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఓవైనా మందులు కొరత ఉందా? అని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పశుపోషణ, పాడి పశువుల పెంపకంపై రైతులు ఆసక్తి చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రిస్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు అంజినప్ప, మాజీ సర్పంచ్ వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల సమస్యలు పరిష్కరించండి


ఏసీకి వినతి పత్రం అందిస్తున్న అర్చక సమాఖ్య ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: అర్చక సమస్యలపై నూతన జిల్లా ఎండోమెంట్ నూతన సహాయ కమిషనర్ ఆదిశేషునాయుడు దృష్టి సారించాలని జిల్లా అర్చక సమాఖ్య ప్రతినిధులు కోరారు. గురువారం అర్చక సమాఖ్య అధ్యక్షుడు ఆంజనేయులు నేతృత్వంలో పలువురు అర్చకులు ఎండోమెంటు ఏసీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అన్యాక్రాంతమైన దేవుడిమాన్యం, అర్చక సమస్యలు, సత్వరం పరిష్కరిస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో జూలై 3న నగరంలోని కాశీవిశ్వేశ్వర కోదండరామాలయంలో శ్రీనివాస కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నామని ఎండోమెంట్ అధికారులు, సిబ్బంది భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో అర్చక సమాఖ్య ప్రతినిధులు శ్రీనివాసులు, శ్రీహరి, సత్యనారాయణ, మధుసూదన్ పాల్గొన్నారు.

తపాలా పాలసీల పునరుద్ధరణకు అవకాశం

అనంతపురం సిటీ: కాలపరిమితి ముగిసిన పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ పాలసీల పునరుద్ధరణకు అవకాశం కల్పిస్తూ తపాలా శాఖ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించి ప్రీమియం చెల్లింపుపై జూన్ ఒకటి నుంచి ఆగస్టు 31వ తేదీ మధ్య కాలంలో డిఫాల్ట్, ఆలస్య రుసుముపై మినహాయింపు వర్తిస్తుంది.

వినువీధిలో వి'చిత్రం'

సూర్యుడు..తూర్పున ఉదయిస్తాడు.. పడమర అస్తమిస్తాడు... ఉషోదయం వేళ చీకటిని చీల్చి వెచ్చని కిరణాలతో జనజీవనాన్ని మేల్కొలుపుతాడు.. మధ్యాహ్నం వేళ.. నెత్తిన నిప్పుల కొలిమిని తలపిస్తాడు.. సాయంత్రం వేళ.. పగటికి స్వస్తి చెప్పి మేఘాల మాటున దాగుతూ ఒదుగుతాడు.. పొద్దంతా భగభగ మండి సాయంత్రానికి చల్లబడతాడు. మెల్లమెల్లగా నీలిమేఘాల మాటున నక్కుతుంటే నీలాకాశం చల్లబడుతుంది. చల్లని గాలికి చెట్టూ చేమపైన పిట్టలు వాలతాయి. ఊరూవాడ సేదతీరుతుంది.. ఇలాంటి రమణీయ దృశ్యాలను 'సాక్షి' కెమెరా బంధించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:


అరుణ కాంతిలో వినీలాకాశం ఇలా..


చెరువుపై సూర్యకాంతి.. చాబాల వద్ద అందమైన దృశ్యం.


'గాలిమర'లింది.. ఉరవకొండ వద్ద ఆగిన గాలిమరలు


పొద్దు కుణికింది..
చీకటి పడుతుండగా ఉరవకొండ గ్రామం ఇలా..


పగటికి సమాప్తం.. అడుగడుగో సూరీడు


ఇదిగో ఇస్కాన్ రథం ..
సూర్యాస్తమయం వేళ అరుదైన దృశ్యం ఇలా..

ఈఈ రామమోహన్ రెడ్డి రిలీవ్

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలోని ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఈఈ రామమోహన్ రెడ్డిని కమిషనర్ రమణారెడ్డి గురువారం రిలీవ్ చేశారు. ఇటీవల ఈయన పబ్లిక్ హెల్త్ సర్కిల్ ఆఫీస్‌కి బదిలీ అయిన విషయం విదితమే.

అనంత రైజింగ్ స్టార్స్ గెలుపు


క్రికెట్ ఆడుతున్న దృశ్యం

అనంతపురం: అనంతపురం క్రికెట్ లీగ్‌లో భాగంగా కోగటం వారియర్స్, అనంత రైజింగ్ స్టార్స్ మధ్య గురువారం జరిగిన మ్యాచ్‌లో అనంత రైజింగ్ స్టార్ గెలుపొందింది. వర్షం కారణంగా 15 ఓవర్లకే మ్యాచ్ కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన కోగటం వారియర్స్ జట్టులో కేహెచ్ వీరారెడ్డి (32 పరుగులు), బీఎస్ వినయ్‌కుమార్ (24 పరుగులు) రాణించారు. దీంతో 116 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంత రైజింగ్ స్టార్ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 14.1 ఓవర్లలోనే 7 వికెట్ల నష్టానికి 118 పరుగులు చేశారు. అనంత రైజింగ్ స్టార్ జట్టులో ఎంకే దత్తారెడ్డి (53 పరుగులు), ఎస్ఎండీ కమిల్ 26 పరుగులు) సత్తా చాటారు. ప్రతిభ చాటిన అనంత రైజింగ్ స్టార్స్ క్రీడాకారులను డాక్టర్ సుప్రజ చౌదరి అభినందించారు.

జలవనరులశాఖలో బదిలీలు

అనంతపురం సెంట్రల్: రాష్ట్ర వ్యాప్తంగా జలవనరులశాఖలో భారీగా బదిలీలు జరిగాయి. అయితే జిల్లాలో అధికారులందరికీ ఐదేళ్లు పూర్తి కాకపోవడంతో ఎవరికీ బదిలీలు జరగలేదు. హంద్రీనీవా –3 ఎమ్మిగనూరు ఈఈ మురళీ బదిలీపై హంద్రీనీవా–2 పెనుకొండ డివిజన్ ఈఈగా నియమితులయ్యారు.

రూ.1.70 కోట్లతో డీఐ పైప్‌ల ఏర్పాటు


ఆదర్శనగర్‌లో పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.70 కోట్లతో పాత ఎంఎస్ పైప్‌లకు బదులుగా డక్టయిల్ ఐరన్ పైప్‌లను ఏర్పాటు చేసి నీటి సమస్య పరిష్కరించనున్నట్లు మేయర్ వసీం తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఏపీ ఎండీపీ పైప్‌లైన్ పనులను పూర్తి స్థాయిలో చేపట్టలేదన్నారు. అప్పట్లోనే టెండర్ ప్రకారం పాత మైల్డ్ పైప్‌ల స్థానంలో డక్టయిల్ ఐరన్ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేసింటే వివిధ ప్రాంతాల్లో లీకేజీ సమస్యలు ఉత్పన్నమయ్యేవి కావన్నారు. 32వ డివిజన్‌లోని ఆదర్శనగర్‌లో జరుగుతున్న పైప్‌లైన్ పనులను మేయర్ పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో పైప్‌లైన్ పనులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పనులు పూర్తయితే తాగునీటి ట్యాంకులకు నీటి సరఫరా అయ్యే పైప్‌లైన్ లీకేజీలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. 30 నుంచి 40 ఏళ్ల పాటు ఏవిధమైన లీకేజీ సమస్యలు తలెత్తవన్నారు. ఇప్పటికే నగరంలోని జార్జ్‌పేట, రాంనగర్, ఎంజీ కాలనీ, రెండో రోడ్డు, లక్ష్మీనగర్, అరవిందనగర్, విద్యుత్‌నగర్ ట్యాంకుల వద్ద జరుగుతున్న పనులను పరిశీలించనున్నట్లు తెలిపారు. కార్పొరేటర్లు కమల్‌భూషణ్, అనిల్‌కుమార్‌రెడ్డి, సంపంగి రామాంజనేయులు, ఎస్ఈ సతీష్‌చంద్ర, డీఈ నరసింహ, ఏఈ సాయినాథ్‌బాబు, నాయకులు ఖాజా, కాకర్ల శ్రీనివాస్ రెడ్డి, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

రాచానపల్లి ఉపసర్పంచుగా మన్నల వరలక్ష్మి


ఉప సర్పంచ్‌కు ధ్రువీకరణపత్రం అందిస్తున్న రిటర్నింగ్ అధికారి మాధవి

రాప్తాడురూరల్: రాచానపల్లి ఉప సర్పంచ్‌గా నాల్గో వార్డు సభ్యురాలు మన్నల వరలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చివరి రెండున్నరేళ్లు మరొకరికి అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రస్తుత ఉప సర్పంచ్ జీసీ రామచంద్ర రెన్నెళ్ల కిందట తన పదవికి రాజీనామా చేశారు. ఈ క్రమంలో ఇటీవల ఉప సర్పంచ్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేశారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, వార్డు సభ్యుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈఓఆర్డీ మాధవి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. మన్నల వరలక్ష్మితో పాటు 2వ వార్డు సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి బరిలో నిలిచే ప్రయత్నం చేశారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మన్నల వరలక్ష్మికి అవకాశం ఇవ్వాలని పలువురు కోరగా, రాజశేఖర్‌రెడ్డి అంగీకరించి బరి నుంచి తప్పుకున్నాడు. మెజార్టీ సభ్యులు సభ్యులు చేతులు పైకి ఎత్తి వరలక్ష్మికి మద్దతు పలికారు. దీంతో ఆమె ఉప సర్పంచ్‌గా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ధ్రువీకరించారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అంజియాదవ్ మాట్లాడుతూ ముందు రెన్నురేళ్లు బీసీకి అవకాశం కల్పించామని, తర్వాత రెండున్నరేళ్లు ఎస్సీలకు అవకాశం ఇద్దామని కోరగా, రాజశేఖర్‌రెడ్డి బరి నుంచి తప్పుకోవడం అభినందనీయమన్నారు. కొత్తగా ఎన్నికైన ఉప సర్పంచ్‌కు పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు గౌస్, వైఎస్సార్‌సీపీ నాయకులు జి.జయకృష్ణారెడ్డి, జి.రమణారెడ్డి, వై.రామకృష్ణారెడ్డి, జి.శ్యాంసుందర్‌రెడ్డి, పి.సూర్యనారాయణరెడ్డి, పి.రామ్మోహన్, అశోక్ ఆనంద్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, సచివాలయ కన్వీనర్లు బాలకృష్ణ, రామాంజనేయులు, రామ్మోహన్‌రెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.

త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలి

రాప్తాడు: అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి, పక్కా గృహాలు నిర్మించి ఇవ్వడమే లక్ష్యమని తహసీల్దార్ లక్ష్మీ నరసింహ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ గౌతమి ఆదేశాల మేరకు గురువారం ఆయన బొమ్మేపర్తి, బుక్కచెర్ల, గాండ్లపర్తి గ్రామాల్లోని వైఎస్సార్ జగనన్న లేఅవుట్లను ఆకస్మికంగా పరిశీలించారు. లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడారు. ఇక్కడ లేఅవుట్లు ఎన్ని ఉన్నాయి? ఎంత మందికి పట్టాలు ఇచ్చారు. ఎంత మంది ఇళ్ల నిర్మాణం చేపట్టారు అని హౌసింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు పక్కా గృహం నిర్మించాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. ఆరు మండలాల్లో దాదాపుగా 30 వేల మంది పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేసి, ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, హౌసింగ్ సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఏఓగా శ్రీధర్ బాధ్యతల స్వీకరణ


ఏఓకు శుభాకాంక్షలు చెబుతున్న సిబ్బంది

అనంతపురం అర్బన్:కలెక్టరేట్ పరిపాలనాధికారి (ఏఓ)గా కె.శ్రీధర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పరిపాలన విభాగం సిబ్బంది ఆంజనేయులు, లీలాకాంత్, భరత్, శ్రీనివాసులు, తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలకనుగుణంగా సిబ్బంది సహకారంతో ప్రజలకు, ఉద్యోగులకు మెరుగైన సేవలు సత్వరం అందించేందుకు కృషి చేస్తామన్నారు.

ధర్మాచరణతోనే ఉత్తమ జీవితం


మాట్లాడుతున్న శంకర విజయేంద్ర సరస్వతి స్వామి

అనంతపురం కల్చరల్: ధర్మాచరణం అత్యుత్తమ జీవన విధానమని, దాని తోనే ఉత్తమ జీవితం ప్రాప్తిస్తుందని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ ఉద్బోధించారు. హైందవ ధర్మ ప్రచారంలో భాగంగా ఆయన గురువారం రాత్రి బెంగళూరు నుంచి కర్నూలుకు వెళ్తూ మార్గమధ్యంలో అనంతలో బసచేశారు. సోములదొడ్డి గ్రామం అభయాంజనేయస్వామి దేవస్థానం వద్ద స్వామీజీకి వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అనుగ్రహభాషణం చేశారు. ధర్మాచరణం, భక్తిమార్గం తదితర అంశాలను వివరించారు. అనంతరం పాదపూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలనందించారు. కార్యక్రమంలో పలు హిందుత్వ సంస్థల ప్రతినిధులు, దేవస్థానం ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యం కోసం పాటుపడాలి

- పారిశుధ్య కార్యదర్శులకు ఎమ్మెల్యే అనంత ఆదేశం


పారిశుధ్య కార్యదర్శులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేశ చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు.. బాధ్యతగా పనిచేసి, ప్రజారోగ్యం కోసం పాటుపడాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో పారిశుధ్య కార్యదర్శులు వినతి పత్రం అందించారు. పారిశుధ్య కార్యదర్శులు ఉదయం 5.30 గంటల నుంచి 10 గంటల వరకు పని విషయంలో మినహాయింపు ఇవ్వాలని ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేశారు. అందుకు ఆయన అంగీకరించలేదు. వందల మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తుంటే మీరు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుందన్నారు. వేకువజామున విధుల్లోకి వెళ్లేనే పారిశుధ్యం మెరుగు పరిచేందుకు అవకాశం ఉంటుందన్నారు. నగరాభివృద్ధిలో భాగస్వాములవ్వకపోతే ఎలా? అని అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో 74 సచివాలయాల్లో 740 మంది సిబ్బంది ఉన్నారని, గతంలో నగరపాలక సంస్థ ప్రజారోగ్యాధికారుల పర్యవేక్షణలో వందలాది మంది పనులు చేసేవారన్నారు. అలాంటప్పుడు ఇంత మంది ఉండి పని చేయడానికి సందేశిస్తే ఎలా అన్నారు. అధిక పని గంటలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జనన, మరణ ధృవీకరణ పత్రాల మంజూరు అంశాన్ని మరోసారి పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు. న్యాయమైన విజ్ఞప్తులను సీఎం దృష్టికి తీసుకెళ్లి, మీ ఉద్యోగం పేరులో శానిటేషన్ సెక్రటరీకి బదులుగా మరో గౌరవప్రదమైన పేరుతో పిలిచేందుకు కృషి చేస్తానని అన్నారు. ప్రతి ఒక్కరూ జాబ్‌చార్ట్‌కనుగుణంగా పని చేసి, ప్రజారోగ్యాన్ని కాపాడాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో పారిశుధ్య కార్యదర్శులు ముత్యాలప్ప, హనుమంతు, తిప్పేస్వామి, నరసింహమూర్తి, హేమ, దేవి, లావణ్య, తదితరులున్నారు.

వైభవంగా ధ్వజ స్తంభ ప్రతిష్ట


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

రాప్తాడు: మండల కేంద్రంలో స్థానిక రామేశ్వర స్వామి ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ట మహోత్సవం గురువారం కనుల పండువగా వైభవంగా నిర్వహించారు. వేదపండితులు గత రెండు రోజులుగా శాస్త్రోక్తంగా పూజలు, పుణ్యాహవచనంతో పాటు, యజ్ఞ హోమాదులు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో వేదపారాయణం, నిత్యనిధి, గర్భపూజ, రత్నన్యాసం, యంత్ర స్థాపన, బింబి ప్రతిష్ట, కుంబాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి భక్తులు పూజలు చేశారు. గ్రామంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై ధ్వజ స్తంభానికి పూజలు చేశారు. అనంతరం గ్రామ ప్రజల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ఆర్యన్ స్కూల్ ప్రారంభం

రాప్తాడురూరల్: నగరంలోని హౌసింగ్ బోర్డ్ హమాలీ కాలనీలో ఆర్యన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌ను ఎస్పీ కంచి శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఎస్పీకి పాఠశాల డైరెక్టర్లు జి. సందీప్, ఎం. రాజు, ప్రిన్సిపాల్ లహరి స్వాగతం పలికారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, సామాజిక వేత్త అనిల్ కుమార్ రెడ్డి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి హాజరయ్యారు.

అనాథ విద్యార్థులకు అండగా గురుసదన్


చిన్నారులకు వసతి సౌకర్యం కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థలు

అనంతపురం కల్చరల్: అనాథ పిల్లలను ఉచితంగా చదివించడానికి గురు సదన్‌ను ఏర్పాటు చేసినట్లు బాలయోగి ఆశ్రమ నిర్వాహకులు వెంకటేష్ గుప్తా, రత్నగిరి దేవరాజ్, సామ్రాట్ అన్నారు. శివబాలయోగి చారిటబుల్ ట్రస్టు, వేంకటేశ్వర చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో నిర్మించిన గురుసదన్‌లో గురువారం 16 మంది విద్యార్థుల, సంరక్షకుల పరిచయ వేదిక జరిగింది. నూతనంగా ప్రవేశం కల్పించిన విద్యార్థులకు షిర్డీసాయి మోక్షిత్ స్కూల్ సుబ్బారెడ్డి 3 నుంచి 10 వరకు ఉచితంగా చదివించడానికి ముందుకొచ్చారు. షిర్డీ సాయి అన్నవితరణ ట్రస్టు జక్క సుబ్రమణ్యం జీవితాంతం విద్యార్థులకు భోజన వసతి, ముత్యాలరెడ్డి డెయిరీ ఆధ్వర్యంలో పాలు, పెరుగు వితరణ ఉంటుందన్నారు. ఇగ్నైట్ ఫౌండేషన్ తరఫున డాక్టర్ అభిషేక్ ఉచిత వైద్య సేవలందించనున్నట్లు తెలిపారు. అంతకు ముందు అనంతేశ్వరి, అనంతేశ్వరులకు ప్రత్యేక పూజలు జరిగాయి.

చిన్నారులు కళల్లోనూ రాణించాలి


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం కల్చరల్: చిన్నారులు చదువుతోపాటు కళల్లోనూ రాణించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. గురువారం రాత్రి స్థానిక లలితకళాపరిషత్‌లో అనంత డ్యాన్సు ఫెస్టివల్ సందడిగా జరిగింది. అనంత డ్యాన్సు అకాడమీ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు వేడుకలను జిల్లా కళాకారులు ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు భరద్వాజ్ మాస్టర్ శిష్యబృందం ఆటపాటలతో ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన డ్వీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, ఎల్కేపీ అధ్యక్ష కార్యదర్శులు వెంకట సుబ్బయ్య, పద్మజ, సామాజిక సేవా కార్యకర్తలు ఏజీ అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రమీళమ్మ, విజయ్‌సాయి తదితరులు మాట్లాడారు. కళల్లో చిన్నారులను ప్రోత్సహించి వారిని గొప్ప కళాకారులుగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం చిన్నారులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలందించారు.

ప్రజారోగ్యంపై నిర్లక్ష్య ధోరణి వీడాలి

అనంతపురం క్రైం: ప్రజారోగ్యం విషయంలో నిర్లక్ష్యధోరణితో వ్యవహరించి విధులకు గైర్హాజరైతే ఉపేక్షించేది లేదు.. ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేశాం.. షోకాజ్ నోటీసులిచ్చి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ రమణారెడ్డి నగరంలోని 68 మంది పారిశుధ్య కార్యదర్శులను హెచ్చరించారు. గురువారం ఉదయం పారిశుధ్య కార్యదర్శులు విధులకు రాలేదన్న విషయాన్ని తెలుసుకున్న ఆయన.. టెలీకాన్ఫరెన్స్‌లో కార్యదర్శులతో మాట్లాడారు. సమయపాలనపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావాల్సి ఉందన్నారు. అంతవరకు ఉదయం 5.30 గంటలకు విధులకు తప్పక హాజరుకావాలన్నారు. వివిధ డివిజన్లలో పారిశుధ్య పనులను పర్యవేక్షించి, ఎప్పటికప్పుడు చెత్తా చెదారాన్ని తరలించేలా చూడాలన్నారు. శుక్రవారం విధులకు గైర్హాజరైతే తర్వాత జరిగే పరిణామాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. వర్షాలు పడే సమయంలో కాలువలు బ్లాక్ అయ్యి, సీజనల్ వ్యాధులు ప్రబలితే ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. జాబ్‌చార్ట్ ప్రకారం విధులకు హాజరుకావాల్సిందేనన్నారు. పారిశుధ్య సమస్య తలెత్తకుండా కమిషనర్ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నారు. ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లతో కమిషనర్ మాట్లాడారు. బ్లాక్ అయిన కాలువల్లో పూడిక తీసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయన అమినిటీలతో మాట్లాడారు. జగనన్న లే అవుట్లలో లబ్ధిదారులకు అందించిన సదుపాయాలపై సంబంధిత లెటర్‌ను తీసుకోవాలన్నారు.